THE

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

## OFFICIAL REPORT

*15th day of the Fourth Session of the Andhra Pradesh Legislative Assembly*

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

Monday, the 2nd March, 1970.

The House met at Half-Past-Eight of the Clock.

(Mr. Speaker in the Chair)

Mr. Speaker :—I am sorry to announce to the House the demise of Sri K. Kusumeswara Rao, M.L.A., last night. The Leader of the House may move the condolence motion.

## CONDOLENCE MOTION

*re:* DEMISE OF SRI K. KUSUMESWARA RAO, M.L.A.

The Chief Minister (Sri K. Brahmananda Roddy):— Sir. I move :

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Katreddi Kusumeswara Rao and conveys its deep symphathy to the members of the breeaved family."

Mr. Speaker :—Motion moved.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి :—అధ్యక్షా, ఇది మళ్ళీ ఒక పిడుగులా వచ్చిన వార్త. శ్రీ కుసుమేశ్వరరావుగారు, ఇంకా చాలామంది గౌరవ సభ్యులు నిన్నరాత్రే 8—9–30 గంటల మధ్య ఫారెస్టు మినిష్టరుగారైన సాగి సూర్యనారాయణరాజుగారు విందుకు పిలిస్తే, అక్కడ అందరూ హాజరైనారు. వారు కూడా వచ్చినారు. మా అందరితో వారు కలిసి వున్నారు. హఠాత్తుగా, రాత్రి పన్నెండు ఒంటిగంట మధ్య వారు చనిపోయినారు, వారి మరణం వారి స్నేహితులను, వారి బంధువులనే గాకుండా మనందరినీకూడా దుఃఖసముద్రంలో ముంచివేసింది. అధ్యక్షా, వారి వయస్సు 52-53 సంవత్సరాలు మాత్రమే. వారు ఉండి కాన్‌స్టిట్యుయెన్సీ నుండి పోయిన 67 జనరల్ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నుకోబడినారు. తరువాత ఒక సంవత్సరంలోపల వారు కాంగ్రెస్‌లో చేరడం తమందరికీ తెలుసు. వారు ఆ సమితియొక్క అధ్యక్షులుగా పనిచేసినారు. అక్కడ భీమవరం ప్రాంతంలో, ఉండి ప్రాంతంలో — పశ్చిమగోదావరి జిల్లాలో వారు చాల ప్రముఖ పాత్రను నిర్వహిస్తూ, ఎంతో మంచి పట్టుదలగల కార్యకర్తగా రూపొందినారు. వారు రాత్రి భోంచేసివచ్చి,

స్నేహితులతో మాట్లాడుకుంటూ, సుమారు పది, పదిన్నర గంటలవరకు కూడా మాట్లాడుకుంటూ, ఏదో కొంచెం గుండె నొప్పిగా వున్నదని గదిలోనికి వెళ్ళినారు. మిత్రులు, మన శాసన సభ్యులు అయిన వెంకటరెడ్డిగారిని తీసుకుని, ప్రక్కన గదిలో వారుకూడా పడుకున్నారు; అప్పుడు డాక్టర్ని పిలిచినారు; వారు వచ్చి-బి. పి. ఎక్కువగా వున్నది, అని ఏవో మాత్రలు యిచ్చి, రేపు ప్రొద్దున్నే మీరు ఏంబులెన్స్‌లో తీసుకెళ్ళి, ఆస్పత్రిలో చేర్చమని చెప్పినారట. మళ్ళీ పన్నెండు పన్నెండున్నర గంటల మధ్యలో వెంకటరెడ్డిగార్ని పిలుచుకురమ్మని, డాక్టర్ని పిలిచిన కాస్సేపటిలోనే, డాక్టరు వచ్చే లోపలనే వారు చనిపోవడం తటస్థించింది. చాలామంది అక్కడవున్న సభ్యులు చేరారు; నేనుకూడా ఉదయం వెళ్ళాను. వారి భౌతిక కాయాన్ని అయిదుగంటలకు యిక్కడ నుండి పోలీస్ వాన్‌లో పంపించారు. ఇక్కడ కూడా చాలా నెమ్మదిగా వుండేవారు; చాలా పట్టుదలైన మనిషిగా నాకు బాగా తెలుసు. ఇంత చిన్న వయస్సులోనే వారు చనిపోవడం, ఆంధ్ర ప్రదేశ్‌కు తీరని నష్టం. అందులో ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాకు చాలా నష్టం. చాలామంది పశ్చిమ గోదావరి సభ్యులు, యింకా యిక్కడికి రాలేదనుకుంటాను—వారంతా భీమడోలు షుగర్ ఫ్యాక్టరీ ఫౌండేషన్ స్టోన్ సందర్భంగా యిక్కడికి వచ్చారు. బహుశా దారిన వారి భౌతిక కాయాన్ని చూసే అవకాశం దొరుకుతుందనుకుంటాను. మన శాసనసభ తరఫునుంచి, వారి కుటుంబానికి సానుభూతి తెలియబరచవలసిందిగాను, భగవంతుని వారి ఆత్మకుశాంతి ప్రసాదించవలసిందిగాను నేను ప్రార్థిస్తున్నాను.

డాక్టర్ టి. వి. యస్. చలపతిరావు (విజయవాడ) :—అధ్యక్షా, అదేమి దురదృష్టమోగాని, మన దురదృష్టాలు పెరుగుతున్నాయి. తెల్లారుఝామున నాలుగు గంటలకు, మిత్రులు అకస్మాత్తుగా పోయినారని అంటే, సభానాయకులు సెలవిచ్చినట్లుగా, ఆ వార్త విని, వెంటనే వారి నివాసానికి వెళ్ళి చూస్తే, మామూలుగా నిద్రపోతున్నట్లుగా వున్నారుతప్ప మరణించిన వ్యక్తిగా మాత్రం కనిపించలేదు. మంచి పుష్టిగల శరీరం; సహృదయుడు; స్నేహపాత్రుడు; నిరాడంబరజీవి; వారి అకాల మరణానికి చింతిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబానికి నా తరఫున, మా పార్టీ తరఫున సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వై. వెంకట్రావు (వేమూరు) :— అధ్యక్షా, నిన్న రాత్రి సూర్యనారాయణరాజుగారి యింటికి భోజనానికి కూడా వచ్చారు. నేను టెలిఫోన్ చేస్తుంటే వారు టెలిఫోన్ వద్దకు కూడా వచ్చారు. రాత్రి పదకొండు గంటల వరకూ అక్కడనే వుండడం జరిగింది. వారు నిజంగా నిరాడంబర జీవి; సహృదయుడు; చాల విషాదకరమైన వార్త యిది. ఇది అకాల మరణం; చిన్న వయస్సు—ఎప్పుడూ నవ్వుతూ వుండేవారు. ఎప్పుడూ ఏదో ఆఫీసుకు వెడుతూ, ప్రజల పనులతో తిరుగుతూ వుండేవారు. ప్రజల ఆదరణ పొందిన వ్యక్తి. వారు పోవడం చాలా దురదృష్టకరం. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కుడిపూడి ప్రభాకరరావు (అమలాపురం) :— అధ్యక్షా, మిత్రులు కుసుమేశ్వరరావుగారు అకాలమరణం చెందారు అనే వార్త విని మేము దిగ్భ్రాంతులమైనాము. నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకూ మేము అంతా కలిసి మెలిసి తిరగడం జరిగింది. ఎప్పుడూ కూడా చిరునవ్వుతో వుండేవారు. మిత్రులతో ఆయన ప్రాబ్లమ్స్ — రైతాంగం యొక్క ప్రాబ్లమ్స్, డ్రెయినేజి ప్రాబ్లమ్స్ చర్చిస్తూ వుండేవారు; రైతాంగంయొక్క ప్రాబ్లమ్స్, డ్రెయినేజ్ మొదలైన ప్రాబ్లమ్స్ ఆయన విపులంగా అర్థం చేసుకుని, వాటికి సంబంధించి. రైతులకు చాలా మంచి చేయవలయుననే పట్టుదలతో వుండేవారు. అది గ్రహించి. ప్రభుత్వంవారు డ్రెయినేజ్ బోర్డులో వారిని మెంబరుగా వేయడం జరిగింది. అటువంటి సహృదయులైన, స్నేహశీలి అయిన కుసుమేశ్వర రావుగారు మనందరినీ దుఃఖ సముద్రంలో వదలి, అతిత్వరితంగా ఈశ్వర సాన్నిధ్యానికి వెళ్ళిపోయినారు. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మా పి. డి. పి. తరఫున బలపరుస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. గోవిందరావు (అనకాపల్లి) :—అధ్యక్షా, శ్రీ కుసుమేశ్వరరావుగారిని నేను యింతకుముందు ఎరగను. ఇక్కడ శాసన సభ్యులుగా వారు వుంటున్నప్పటికీ కూడా, నిన్నరాత్రి అక్కడ జరిగిన డిన్నర్‌లో నేను వారిని చూడగలిగాను. ఇటువంటి వార్త వినవలసి వస్తుందని ఎవరూ ఊహించలేదు. వారియొక్క అకాల మరణానికి చాలా చింతిస్తున్నాము. మిత్రులు, పెద్దలు చెప్పినదానినిబట్టి, వారియొక్క నిరాడంబరత్వం, వారియొక్క కృషి, పట్టుదల విశదమవుతున్నాయి. వారి స్మృతికి విచారాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ టి. వి. రాఘవులు (గోపాలపురం) :—అధ్యక్షా, సభానాయకులు ప్రవేశపెట్టిన యీ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, మిత్రులు శ్రీ కుసుమేశ్వర రావుగారు అకస్మాత్తుగా పోవడంవల్ల మానవ జీవితం ఎంత బుద్బుదప్రాయమో మరొకసారి మనకు జ్ఞాపకం చేసిందని మనవి చేస్తున్నాను. మొన్న శనివారం నాడు యిక్కడ నాకు రెండుగంటలనుంచి ఎక్కిళ్ళు పట్టుకున్నాయి. యిక కూర్చోలేను అంటే వారు నన్ను వారి కారులో తీసుకువెళ్ళి దింపారు. ఆదివారం వారిని కలుసుకోలేకపోయినాను. తరువాత, వారు గుండెజబ్బువల్ల హఠాత్తుగా మరణించడం అంటే చావు ఎవ్వరికీ నోటీసు యివ్వదు, డాక్టరులు కూడా ఏమీ చేయలేరేమోననిపిస్తున్నది. ఇది చాలా అన్యాయం. ఐనప్పటికీ మనం ఏమీ చేయలేము. శ్రీ కుసుమేశ్వరరావు స్నేహపాత్రుడు, నీతి నిజాయితీలలో నిప్పువంటి మనిషి. ఎక్స్‌పెరిమెంటల్ బ్లాకులో సామాన్య సభ్యుడుగా ప్రారంభం చేసి, రైతు నాయకుడుగా వుండే మనిషి. మొట్టమొదటిసారిగా ఎన్నికలు జరుపుకున్నప్పుడు అక్కడ వుండే లోకల్ ఫాక్షన్సుకు అతీతమైన పాత్ర వహించి రంగరాజుగారిని ప్రెసిడెంటుచేసి, వీరు వైస్ ప్రెసిడెంటు అయ్యారు. ఆ తరువాత

వీరినే ప్రెశిడెంటు చేశారు అక్కడ ప్రజలు. పంచాయతీలు ఆ తరువాత రంగరాజుగారు శాసనసభ్యుడుగా వుండి, వీరికి చేదోడు వాదోడుగా వుంటూ వచ్చారు, 67లోనే వారు శాసనసభకు వచ్చారు. వచ్చినప్పటినుండీ అక్కడ వుండే రైతు సమస్యలను పరిష్కరించడంలో నిర్విరామ కృషి చేసిన పెద్దమనిషి వారు. ఎక్కడ కూర్చున్నా కూడా ఎదటివాడిని కవ్వించి, నవ్వించి, తాను నవ్వడం వారికి అలవాటు. వారు జీవితాన్ని బహు తేలికగా చూచే మనిషి. రాత్రి డాకరు వారినిచూచి ఉస్మానియా హాస్పిటలులో చేరండి అంటే ఇదేదో మస్క్యులర్ పెయిన్ అయివుంటుంది, రేపు ఉదయం చేరవచ్చును లెండి అన్నారు. జీవితం అంటే అంత తేలికగా చూసే గుండె నిబ్బరం వున్న మనిషి హఠాత్తుగా మృత్యువాత పడతారని ఎవ్వరూ ఊహించరు. గొప్ప స్నేహితుడు, సహృదయుడు పోవడం మన శాసన సభకు తీరని లోటు, ఆంధ్ర దేశానికే లోటు. మా పశ్చిమగోదావరి జిల్లాకు మరింత లోటు అని మనవి చేస్తున్నాను. వారి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలుగుగాక యని కోరుతున్నాను.

శ్రీ కె. బుచ్చిరాయుడు (కొవ్వూరు) :— అధ్యక్షా, కుసుమేశ్వరరావు గారు పోయారనే వార్త యీ ఉదయమే విని మేము చాలా బాధపడ్డాము. వారు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం తాలూకానుంచి శాసన సభ్యులుగా వచ్చారు. ఆర్థికంగా—ముఖ్యంగా రాజకీయ చైతన్యం చెందిన తాలూకానుంచి వచ్చిన కుసుమేశ్వరరావుగారు స్నేహపాత్రుడు ఆయన పోవడం చాలా విచారకరం. పశ్చిమ గోదావరి జిల్లాలో పాతవారి రోజులుపోయి, క్రొత్తవారికి స్థానం కలుగుతోంది అనుకునే యీ తరుణంలో వీరు పోవడం మావంటి క్రొత్త వారికి ఆశాభంగం కలిగిస్తోంది. ఆ దృష్ట్యా భగవంతుడు మమ్మలను అన్యాయం చేశాడు. వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను. వారికి భగవంతుడు స్వర్గతుల్యమైన ఆత్మశాంతి కల్పించాలని కోరుతూ వారి కుటుంబానికి నా సంతాపాన్ని తెలియజేస్తూ గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి (దోర్నకల్) :—అధ్యక్షా, కుసుమేశ్వరరావు గారు పరమపదించిన వార్త ఐదు నిముషాల క్రితమే తెలిసినది. వారియొక్క గుణగణాల విషయం సభ్యులందరు సెలవిచ్చారు. ఆకస్మికమైన ఈ దుఃఖ వార్త మనలనందరిని ముంచివేసినది, వారితో నాకు హెచ్చుగా పరిచయం లేకపోయినప్పటికి ఈ సభలో మూడు సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నాను. చాలా నిరాడంబరంగా, పెద్దమనిషిగా ప్రవర్తిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానంతో ఏకీభవస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నాను.

శ్రీ పి. గున్నయ్య (పాతపట్టణం) :—అధ్యక్షా, నిన్న ఉదయం ఎనిమిది గంటలకు కుసుమేశ్వరరావుగారు నేమూ కలిసాము. ఎంతో చక్కని మాటలు

ఎంతో చక్కని నవ్వులతో నలుగురు మాట్లాడి ఎంతో ఆనందంగా ఉన్నారు. రాత్రి డిన్నరుకు వెళ్ళారు. ఒక గంటలోగా వారు వచ్చిన తరువాత వారికి మరణం వచ్చింది. కనివిని ఎరుగని బాధ పడ్డాం. వారి సుగుణాలు గురించి సభ్యులు చెప్పారు. ఈ కొద్ది రోజులలోనే నేను వారిని ఎంతగానో తెలుసుకున్నాను. అలాంటివారు బడ్జెటు జరిగే సమయానికి మరణించారు. శాసనసభ జరిగే సమయంలో శాసన సభ్యులు మరణం చెందడం ఇదే ప్రథమం అనుకుంటాను. ఇలాంటి సందర్భంలో హాస్టలులో వైద్య సౌకర్యం అనుకున్నంత శాసనసభ్యులకు జరగలేదని విచారపడుతున్నాను. 50 కోట్ల రూపాయిల ఖర్చుతో బడ్జెటు చేసుకుంటూ, పాత హాస్టలులో కాని, క్రొత్త హాస్టలులో కాని శాసన సభ్యులకు కనీస వైద్య సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరం. నేను పేషెంటును కాబట్టి చెబుతున్నాను. అక్కడ డిస్పెన్సరీ 15 అణాలు పబ్లికుకు ఉపయోగపడితే అణా మాత్రమే శాసనసభ్యులకు ఉపయోగపడడం జరుగుతోంది. మా హక్కులను కాపాడవలసిన తమరు శాసన సభ్యుల ఆరోగ్యాన్ని అన్ని విధాలా చూడవలసిన బాధ్యత తీసుకోవాలని కోరుతున్నాను. ఒక డాక్టరు అక్కడ పబ్లికుకు ఉపయోగపడుతున్నాడు కాబట్టి స్పెషల్‌గా ఒక డాక్టరును పెట్టి — పెద్దవారికి వైద్యం చేసేవారిని కాకపోయినా మామూలు డాక్టరునైనా వేసి ప్రతిరోజూ శాసనసభ్యుల రూమ్స్‌కు వెళ్ళి వైద్య సదుపాయం కల్పించాలి. మరణం ఎవరికైనా వస్తుంది. ఇంత అకస్మాత్తుగా వచ్చినప్పుడు శాసనసభ్యులు కలువవలసి వచ్చిందే కాని అక్కడ ఉన్న బంట్రోతులు, తదితరులు కలిసేభాగ్యం లేకపోయింది. ఈ మధ్యనే ఉవయం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఏదైనా శాసన సభ్యులకు కావలసిన సౌకర్యాలు చేయడానికి బంట్రోతులను పెట్టారు. ఈ మధ్య క్రొత్త ఆర్డరు వచ్చింది. తొమ్మిది గంటలవరకే బంట్రోతులు ఉండాలని మరల పన్నెండున్నరకు రావాలి అని.

మిస్టర్ స్పీకర్ :— తమకు ఒక మనవి, ఈ విషయాలన్నింటికి ఇది సమయం కాదు. మరొకప్పుడు చెప్పవచ్చును.

శ్రీ పి. గున్నయ్య :— ఇది అతి ముఖ్యమైన సమయం. నిన్న చాలా నిరాశ కలిగింది. బంట్రోతులేక రూపాయి ఇచ్చి మిక్చర్ తెచ్చుకున్నాను. ఇలాంటి అజాగ్రత్త వల్లనే శాసన సభ్యుడు హఠాత్తుగా చచ్చిపోవలసి వచ్చింది. గుండె జబ్బులు అందరికి వస్తున్నాయి. శాసన సభ్యుల హాస్టలు అంటే ప్రజల సొత్తు. బంట్రోతులైనా అక్కడ లేకపోతే ఎట్లా ఉండేది? సుమారు లక్షా 50 వేలమంది ప్రజలు ఎన్నుకుంటే ఇక్కడకు వచ్చినవారం. వైద్య సౌకర్యం లేకుండా పోతే ఎట్లా? అందుచేత నేను బాధపడవలసి వస్తున్నది. వారి కుటుంబానికి నా సానుభూతి తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (సత్తెనపల్లి) :— అధ్యక్షా, కుసుమేశ్వరరావు గారిని ప్రథమంగా ఆరు సంవత్సరాల క్రితం నేను హాస్పటలులో ఉండగా

వారుకూడా పేమెంటుగా ఉండి కలిసాము. ఆయన పంచాయతీ సమితి అధ్యక్షులుగాఉండి ప్రజల ఆదరణ పొందినవారు. అనాయాస మరణం న దైన్యేన జీవితం అని చెప్పారు. జీవితంలో దైన్యత లేకపోవడం, అనాయాస మరణం కోరుకోవలసినవిగా చెప్పారు. కుసుమేశ్వరరావుగారు రెండూ పూర్తి చేసుకుని పోయారేమో అనిపిస్తుంది. మానవునికి అంతకంటె కావలసింది లేదేమో అని పిస్తుంది. యువకులు. పెద్ద ప్రాయం లేదు—52 సంవత్సరాలు. శాసన సభకు నిలబడి స్వతంత్రులుగా గెలిచారు. తరువాత కాంగ్రెసులో చేరారు అనుకోండి. మురుగు కాలువల విషయంలో చాలా పట్టుదలగా పని చేశారు. రెండవసారి వరదలు వచ్చినప్పుడు కె. ఎల్. రావుగారు తూర్పుగోదావరి బాగా దెబ్బతిన్నదని చూడడానికి వెడుతుంటె నేను, పాండురంగారావుగారు, ఈయన కూడా వచ్చారు. నరసాపూరువరకు వెళ్ళి పరిస్థితులు చూసి ఏ కార్యక్రమం చేయాలో ఆలోచించారు. వారి ప్రాంతం మురుగు కాలువలతో ఆవరించి నష్టపరుస్తున్న సమయంలో ఆ సమస్యపై చాలా కృషి చేస్తున్నవారు. డ్రయినేజి కమిటీలో ఆయన మెంబరు అనుకుంటాను. వారు చాలా కంట్రిబ్యూషను చేసి ఉండేవారు. వారులేనిలోటు తీర్చడం కష్టం. వారికి జోహారు లర్పిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమర్థిస్తున్నాను.

శ్రీ జి. సూర్యనారాయణ (పాయకరావుపేట) :— అధ్యక్షా, శ్రీ కుసుమేశ్వరరావుగారి అకాల మరణానికి నా విచారాన్ని తెలుపుతున్నాను. మంచి గుణాలు, నడవడిక కలవారు. వారినుంచి మనము నేర్చుకొనవలసిన విషయాలు ఎన్నో వున్నవి. వారితో మాట్లాడేటప్పుడు ప్రజానీకానికి సంబంధించిన సమస్యలగురించి, కార్యక్రమాలను గూర్చి చక్కగా మాట్లాడేవారు. వారి మరణం రైతులోకానికి తీరని లోటు. ఏదో రోజులు వస్తూవుంటాయి, పోతూ వుంటాయి. వారు హఠాత్తుగా పోవడం మనము అందరము విచారించవలసిన విషయము. వారి ఆత్మకు భగవంతుడు శాంతిని కలుగచేయాలని కోరుతూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీ బి. హెచ్. విజయరామరాజు (భీమవరం) :—అధ్యక్షా, ఈ దుర్వార్త నేను హౌస్‌కి రాగానే బుచ్చిరాయుడుగారు మాట్లాడుతూ వుంటే తెలిసినది. నిన్నరాత్రి సాగి సూర్యనారాయణరాజుగారి యింటికి భోజనానికి వెళ్ళినప్పుడు మేము యిద్దరము ఒకచోట కూర్చొన్నాము. నేను సంజీవరెడ్డినగర్ కాలనీలో వుండడమువల్ల ఈ వార్త నాకు అందలేదు. కుసుమేశ్వరరావుగారు, నేను భీమవరం తాలూకా శాసన సభ్యులుగా వుంటున్నాము. ఇంతకుముందు సమితి ప్రెసిడెంట్సుగా వారు అకివీడుకు, నేను విస్సాకోడేరు సమితులకు వుంటిమి, ఇద్దరము శాసనసభ్యులుగా ఎన్నికయివచ్చాము. ఇప్పుడు కాంగ్రెసులో కలిసి ఏకమత్యముగా వుంటున్నాము. ఇటువంటి వార్త అకస్మాత్తుగా వినవలసి ని వూహించలేదు. మంచి హృదయము కలిగిన వ్యక్తి. ఎటువంటి

విషయాన్ని అయినా ఒడుదుడుకులు లేకుండా నిదానముగా ఆలోచించి చెప్పే వ్యక్తి. నేను కొన్ని సందర్భముల్లో ఇంత నిదానము పనిచేయదు, కొంత తొందరగా ముందుకు పోవాలని చెప్పినప్పుడు—నీవు కుర్రవాడవు; నీకు తెలియదు, తొందరపాటు కూడదు అని చెబుతూ ఉండేవారు. మా తాలూకాకు సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు ఏ విధంగా చేయాలని ఇద్దరము కూర్చొని ఆలోచించుకొని చేస్తూ వుండేకారము. భగవంతుడు ఇటువంటి పరిస్థితి కల్పిస్తాడని అనుకోలేదు. వారి ఆత్మకు శాంతిని కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియపరచుకొంటున్నాను.

శ్రీ కె. రామనాథం (ముదినేపల్లి) :—అధ్యక్షా, కుసుమేశ్వరరావుగారి మరణసందర్భముగా సభానాయకులు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానమును మాపార్టీ తరఫున, నాతరఫున బలపరుస్తున్నాను. వారు చాలా నెమ్మదస్తుడు, మర్యాదస్తుడు వారితో వున్నంతసేపూ ఎదుటివారిని మర్యాదగా చూసే స్వభావముగల వ్యక్తి. సరళ హృదయులు. మా ప్రక్క జిల్లా అయిన పశ్చిమగోదావరి జిల్లానుంచి రావడమువల్ల పరిచయము వుంది. హఠాన్మరణానికి లోను అవుతారని అనుకోలేదు. నిన్న రాత్రి వారిని కలవడము జరిగింది. ఈ ఉదయము ఈ విషాద వార్త విని చాలా ఆశ్చర్య పడ్డాను. ఈ సందర్భములో వారి ఆత్మకు శాంతిని కలుగచేయాలి అని కోరుతూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియ పరుస్తున్నాను.

శ్రీ అహమ్మద్ హుస్సేన్ :—అధ్యక్షా, ఈ వార్త నాకు తెలియదు. నేను ఇక్కడకు వస్తూ వుండగా ముఖ్యమంత్రిగారు ఏదో సంతాప తీర్మానమును ప్రవేశపెడుతూ వుంటే ఏమైనది, నెలరోజులే కదా గురుమూర్తిగారి సంతాప తీర్మానము అయినది కదా అని ఆశ్చర్యపడ్డాను. అంతట్లోకి కుసుమేశ్వరరావు గారి పేరు విని చాల బాధ పడ్డాను. వారిని మొన్న కలుసుకొన్నాను. మీ అనుగ్రహమువల్ల నేను చైర్‌లో కూర్చొని వుంటే వారు వచ్చి కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు - బాగా నడిపించుచున్నానని. సడన్‌గా పోయారంటే నాకు ఆశ్చర్యము కలిగించినది. మా దగ్గర వున్న మిత్రులు అకస్మాత్తుగా చనిపోయారు. ఈ రోజుకు మన సమావేశము వాయిదా వేయాలని కోరుచున్నాము.

శ్రీ టి. పాపారావు (నగరికటకం) :—అధ్యక్షా, ఈ రోజు తెల్లవారి లేచిన వెంటనే కుసుమేశ్వరరావుగారు పోయారనే వార్త వినేసరికి హఠాత్తుగా పిడుగుపడినట్లు అనిపించింది. రాత్రి సూర్యనారాయణరాజుగారు యిచ్చిన డిన్నరుకు పోయేటప్పటికి ఏమిటి పాపారావుగారూ వెజిటేరియన్‌కి వచ్చారేమిటి అని నవ్వుతూ వచ్చారు. ఎప్పుడూ నవ్వుతూ, ఉత్సాహముగా వుండేవారు అకస్మాత్తుగా పోయారు అంటే మరుక్షణములో ఏమి అవుతామో అన్పిస్తున్నది. క్షణం చిత్తం, క్షణం విత్తం, క్షణం జీవిత మాయయోః యమస్య కరుణా నాస్తి తస్మాత్ జాగ్రత, జాగ్రత అన్నట్లు ఏ క్షణములో ఎట్లా వుంటామో, ఏమి

అవుతామో తెలియదు. గత సంవత్సరము బడ్జెటు సమావేశములో ఒక సభ్యుడు పోవడము, ఈ ఏడాది బడ్జెటు సెషను వచ్చేసరికి 15 రోజులలో ఇద్దరు సభ్యులు పోవడము చాల విచారకరమైన విషయాలు. డాక్టరును పిలిచినప్పుడు ఇంత సీరియస్ కండిషను వున్నది కనుక వారు దగ్గర వుండి హాస్పిటల్‌కి ఫోన్ చేసి అంబులెన్స్ తెప్పించి హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించే బాధ్యత వుండవలసినది కాని వారు వెళ్ళిపోయినందుకు విచారిస్తున్నాము. ఇక ముందు అయినా హాస్టలులో శాసనసభ్యులకు తగిన ఏర్పాటు అధ్యక్షులవారు చేయవలసినదిగా కోరుతూ సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి ఆత్మకు శాంతిని కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియపరుస్తూ శలవు తీసుకొంటున్నాను.

శ్రీ సి. వి. కె. రావు (కాకినాడ) :—అధ్యక్షా, న్యూ యమ్.యల్.ఏస్. హాస్టలులో ఈ రోజు ఉదయము గది తలుపులు తీసి బయటకు వచ్చేటప్పటికి 3 సంవత్సరాలనుంచి సహచరుడుగా వున్న శాంతమూర్తి కుసుమేశ్వరరావు మరణించాడని విని ఆశ్చర్యపోయాను. చాల విషాదకరమైన విషయము. 60 సంవత్సరాలు రాకుండానే ఇంత తక్కువ వయస్సులో హఠాన్మరణమును పొందినందుకు చాల విచారిస్తున్నాను.

అధ్యక్షా, హాస్టలు చరిత్రలోనే ఇది మరువరాని దుస్సంఘటన. ఇంతవరకు ఏ సభ్యుడూ కూడా హాస్టలులో మరణించిన సంఘటన లేదు. ఇవి మారుతున్న రోజులు. ప్రతి ఒక్కరు శాసనసభలో తమ పాత్రను నిర్వహించి దేశ ప్రజల యొక్క సౌభాగ్యం గురించి కృషి చేయవలసిన రోజులు. ఇటువంటి బృహత్తర బాధ్యత నిర్వర్తించవలసిన సమయంలో మన సహచరుడు మన మధ్య లేకుండా పోవడం విచారకరం. తూర్పు గోదావరి జిల్లాలో ఇండిపెండెంట్ సభ్యులుగా గెలుపొందడం సులువైన విషయం కాదు. బహు శాంతమూర్తి ఆయన. ఈ సోదరుడు ఇండిపెండెంట్ సభ్యుడుగా ఎన్నికై ఇక్కడి చర్చలలో పాల్గొంటూ వారి పూర్తి సహకారాన్ని ఇస్తూ తన 53వ ఏటనే అకాల మరణానికి గురి కావడం మనలనందరనూ విచార సముద్రంలో ముంచినది. ముఖ్య మంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానంతో ఏకీభవిస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తున్నాను. వారి తండ్రి ఇంకా బ్రతికే వున్నారు. వారు వృద్ధులు. వారికి కూడా నా సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీమతి జె. ఈశ్వరీబాయ్ (ఎల్లారెడ్డి) :— అధ్యక్షా, కుసుమేశ్వరరావు గారు మొన్నటివరకు మన మధ్య వుండి ఇవాళ ఉదయానికి మనలోనుండి వెళ్ళి పోవడం విచారకరమైన విషయం. ఈ బడ్జెటు సమావేశం ప్రారంభంలోనే గురుమూర్తిగారు పోవడం, తిరిగి ఈనాడు మన సభలోని మరోసభ్యుడు పోవడం మిక్కిలి విచారకరం. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మా పార్టీ తరఫున బలపరుస్తూ వారి ఆత్మకు శాంతి కలుగుగాకయని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి నాసానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ ఎస్. పి. నాగిరెడ్డి (మైదుకూరు) :— అధ్యక్షా, కుసుమేశ్వరరావుగారితో నాకు తక్కువ కాలం పరిచయం వున్నప్పటికీ మా ఇద్దరకూ ఏదో సంబంధం వున్నట్లు స్నేహితులుగా వుండేవారం. వీరు చనిపోవడం మన శాసనసభకేగాక ఆంధ్ర రాష్ట్రానికే తీరని లోటు అని భావిస్తున్నాను. సభా నాయకులు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంతో పూర్తిగా ఏకీభవిస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తూ వారి ఆత్మకు భగవంతుడు ప్రశాంతత చేకూర్చుగాక అని ప్రార్థిస్తున్నాను.

శ్రీ కె. సి. శ్రీరంగయ్యశెట్టి (సింగ్నమాల) :—అధ్యక్షా, కుసుమేశ్వరరావుగారితో నాకు గత మూడు సంవత్సరాలనుండి పరిచయం వుంది. నేను కొత్తగా ఎన్నికై వచ్చిన తరువాత ఇద్దరము ఒకే హాస్టలులో వుండేవారము. మేము పిల్లవారమని భావించకుండా ఎన్నో విషయాలు మాకు చెబుతూ తన సహోదరులుగా చూశారు. నేను కొత్త హాస్టలుకు వెళ్ళిన తరువాత నీవు ఇక్కడకు రాకూడదా, దూరంగా వెళ్లావేం అని అంటూ వుండేవారు. ఆయన మరణ వార్త విన్న తరువాత ప్రతి ఒక్కరం భయపడే రోజులు వచ్చినట్లుగా వున్నాయి. వారి మరణ వార్త వింటే యిది కలా నిజమా అనిపించింది. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంతో ఏకీభవిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ :— గౌరవ సభ్యులారా! సభా నాయకులు, ప్రతిపక్ష నాయకులు, గౌరవ సభ్యులు కుసుమేశ్వరరావుగారి గురించి ప్రస్తావించిన విషయాలతో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను. ఈ రోజు ఉదయం ఒక గంటకు గుండె జబ్బుతో ఆయన ఆకస్మికంగా మరణించడం దురదృష్టకరమైన విషయం. 20 రోజుల క్రిందట మిత్రులు గురుమూర్తిగారు కూడా ఇదే గుండె జబ్బుతో మరణించడం, రాత్రి సమయంలో మరణించడం పట్ల మనం సానుభూతిని ప్రకటించడం జరిగింది. అదేమి విచిత్రమో 53 సంవత్సరాలు పూర్తి కాకమునుపే హృద్రోగంతో మరణించడం, ఇద్దరూ రాత్రి సమయంలోనే మరణించడం జరిగింది. ఇటీవలనే ఆలిండియా రేడియో డైరెక్టరు బాలసుబ్రహ్మణ్యంగారు కూడ 53 సంవత్సరాలు పూర్తికాకముందే రాత్రిసమయంలో మరణించారని పత్రికలలో చూశాము. మన తోటి సభ్యులు ఇలా మనలను విడిపోవడం విచారకరం. వీరి జీవిత విశేషాలు చూస్తుంటే మొదటినుండి రాజకీయ రంగంలో ప్రవేశించి వివిధ హోదాలలో గణనీయమైన ప్రజాసేవ చేస్తూ వచ్చారు. వారు పోవడం మన రాష్ట్రానికే తీరని లోటు అని మనవి చేస్తున్నాను. గౌరవ సభ్యులు లేచి నిలబడి ఒక్క నిముషం మౌనం వహించవలసిందిగా కోరుతున్నాను.

Mr. Speaker :—The question is :

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri Katreddi Kusumeswara Rao and conveys its deep sympathy to the members of the bereaved family".

The motion was adoped *nem con,* all members standing in silence for a minute.

Mr. Speaker :--The House stands adjourned till Half Past Eight of the Clock on Tuesday, the 3rd day of March, 1970.

(The House then adjourned till Half Past Eight of the Clock on Tuesday, the 3rd March, 1970).